పునరుద్ధరిస్తే ప్రయోజనం..

- బీర్‌పూర్‌లో నిరుపయోగంగా భారీ రక్షిత మంచినీటి పథకం
- పూర్తిస్థాయిలో అందని మిషన్‌భగీరథ నీరు
- ప్రారంభించాలని కోరుతున్న ప్రజలు



రోళ్లవాగు ప్రాజెక్టు



బీర్‌పూర్ రక్షిత మంచినీటి పథకం

సారంగాపూర్: ఇంటింటికీ తాగునీరు అందించాలని ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. మిషన్ భగీరథ పథకం కింద గ్రామాల్లో అదనంగా రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించి, వాటికి ప్రధానలైన్లతో పాటు, ప్రతి ఇంటికీ నీరు చేరేలా ఇంట్రా పైప్‌లైన్లను నిర్మించారు. తరచూ నీటి సరఫరాకు అంతరాయం కలగడం, నీటి సరఫరా జరగని రోజూ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీరందించడం సమస్యగా మారింది.

బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలు

బీర్‌పూర్ మండలంలో బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్, కందెనకుంట, కొల్వాయి, చిన్న కొల్వాయి, కోమన్‌పల్లి, రేకులపల్లి, తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, కండ్లపల్లి, మంగేళ, చెర్లపల్లి, రంగసాగర్, కమ్మునూర్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లోని ప్రజలకు మిషన్‌భగీరథ ద్వారా నీరు అందుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో అందడం లేదు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే అవకాశం

బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలకు తాగునీరు సంపూర్ణస్థాయిలో అందించడానికి గతంలో బీర్‌పూర్ శివారుల్లో ఏర్పాటు చేసిన ఫ్లోరైడ్ రహిత భారీ రక్షిత మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చాలా సార్లు ప్రకటించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీనిని పునరుద్ధరించడానికి అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం..

1990–91లో బీర్‌పూర్ గ్రామ శివారుల్లో రూ.2 కోట్లతో భారీ రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించారు. రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి పంపులతో బీర్‌పూర్ రక్షిత మంచినీటి పథకానికి ప్రత్యేక పైపులైన్లు, మోటార్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ఫిల్టర్ బెడ్‌లోకి నీటిని పంపించారు. అక్కడ ఫిల్టర్ అయిన నీరు సంపుల ద్వారా ట్యాంక్‌ల్లోకి అక్కడి నుంచి బీర్‌పూర్, నర్సింహులపల్లె, తుంగూర్ గ్రామాలతో పాటు, ధర్మపురి మండలంలోని 6 గ్రామాలకు శుద్ధ జలాన్ని అందించడానికి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా నీరు శుద్ధి జరగడానికి ఏలాంటి రసాయనాలు వాడకుండా మూడు ఫిల్టర్ బెడ్‌లలో గోదావరి ఇసుకతో నీటిని శుద్ధిచేసే ఏర్పాటు జరిగింది. దాదాపు 15 ఏళ్లు శుద్ధజలం ప్రజలకు అందగా, ఆ తరువాత మిషన్ భగీరథ పథకం అందుబాటులోకి రావడంతో ఈ పథకం కింద ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు మొత్తం చిన్నాభిన్నమయ్యాయి. రోళ్లవాగు ఆధునీకరణ సమయంలో అక్కడ ఏర్పాటు చేసిన పైపులైన్లు, మోటార్లు, విద్యుత్ లైన్లు తొలగించడంతో పథకం దాదాపు 10 ఏళ్లుగా పనిచేయకుండా పోయింది.

రూ.25 లక్షలు వెచ్చిస్తే పథకం ప్రారంభించొచ్చు

ప్రభుత్వం రూ. 25 లక్షల వరకు వెచ్చిస్తే ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించవచ్చని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈ మంచినీటి పథకాన్ని సందర్శించారు. పునరుద్ధరణకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇది ప్రారంభిస్తే మండలంలోని 15 గ్రామాల నీటి ట్యాంకులకు అనుసంధానం చేసి ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తామని పేర్కొన్నారు.

పునరుద్ధరించాలి



మిషన్ భగీరథ ప్రారంభించి ఏడేళ్లు కావొస్తోంది. మా గ్రామానికి తాగునీరు సక్రమంగా రావడం లేదు. బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరిస్తే ప్రజలకు ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందుతుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అభిలాష్, నర్సింహులపల్లె

నిధుల మంజూరుకు కృషి



బీర్‌పూర్ భారీ రక్షిత మంచినీటి పథకంను తిరిగి ప్రారంభించడానికి కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరుతాం. ఈ పథకం పనిచేస్తే మిషన్‌భగీరథ నీరు రాని రోజు బీర్‌పూర్ మండలంలో అన్ని గ్రామాలకు తాగునీరందించవచ్చు.

– మసర్తి రమేశ్, ఎంపీటీసీ, బీర్‌పూర్

అనారోగ్య సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దు



రోగులను పరీక్షిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ధర్మపురి: ఏ చిన్న అనారోగ్య సమస్యనైనా నిర్లక్ష్యం చేయవద్దని నియమానుసారం వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందుగానే వాటిని గుర్తించి నివారించుకోవాలని సీనియర్ ఫిజీషియన్ డా.ఆకుతోట శ్రీనివాసరెడ్డి అన్నారు. మాధవసేవా పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని రాయపట్నంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన పలువురు డాక్టర్లు శిబిరానికి విచ్చేసిన వందలాది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయడమే కాకుండా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగాలను ముందుగానే గుర్తించడం వలన ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడవచ్చన్నారు. ప్రస్తుత జీవనశైలి వలన అనేక మంది చిన్నతనంలోనే వివిధ రకాల దీర్ఘకాలిక రోగాలకు గురవుతున్నారని తెలిపారు. 30 ఏళ్లు దాటిన వారు ఏడాదికి కనీసం రెండుసార్లైనా సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించుకోవడం వలన ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు రేగుంట ప్రశాంత్, ఇనగుర్తి రాజశేఖర్, శ్రీరఘురాం,సర్పంచ్ ఈర్ల మొండయ్య, ఎంపీటీసీ గోపతి పుష్పలత, అచ్చన్న, గడ్డం దేవక్క, గోపతి అంజిత్, శరత్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పెన్షనర్లు

కోరుట్ల: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్స్ భవన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ట్రీటా అధ్యక్ష, కార్యదర్శులు మేడి కిషన్, గంధ్ర కాంతారావు, ఆంజనేయులు, పిమిషకవి రవి శంకర్, రుద్ర మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



పెగడపల్లి నుంచి పాదయాత్రగా వెళ్తున్న నాయకులు

పెగడపల్లి: ధర్మపురి ఎమ్మెల్యేగా గెలుపొందిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విప్‌గా నియమించడాన్ని హర్షిస్తూ మండల యువజన కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. ప్రభుత్వ విప్‌గా నియామకమైన లక్ష్మణ్‌కుమార్ మొదటిసారిగా ధర్మపురి వస్తున్న సందర్భంగా ఆయనను కలిసేందుకు ఆదివారం పెగడపల్లి నుంచి ధర్మపురి వరకు నాయకులు పాదయాత్ర చేస్తూ బయలుదేరారు. పెగడపల్లి శివాలయంలో పూజలు చేసిన అనంతరం బయలుదేరిన వారు ధర్మపురిలో లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతామన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములుగౌడ్ పాదయాత్రను ప్రారంభించగా యువజన కాంగ్రెస్ నాయకులు విష్ణు, ప్రవీణ్, రాజేందర్, అజయ్, అంజయ్య, బీమయ్య, ప్రశాంత్, ఓయూ రాజకీయ జేఏసీ రాష్ట్ర చైర్మన్ చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, విజయభాస్కర్, తిరుపతి, వంశీధర్‌రావు, సత్తయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ప్రభుత్వ విప్ పదవి వచ్చినందుకు పెగడపెల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం, నాయకులు ధర్మపురి వరకు పాదయాత్ర చేశారు. అనంతరం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీదర్ బాబుకు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

జగిత్యాలలో పెన్షనర్స్ డే



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

జగిత్యాలటౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని జగిత్యాల క్లబ్‌లో జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవగా పెన్షనర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా 70 ఏళ్లు నిండిన పెన్షనర్లను సన్మానించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇబ్రహీంపట్నం: మండలంలో అమ్మక్కపేట, డబ్బా, వర్షకొండ, కోమటి కొండాపూర్ గ్రామాల్లో సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పర్యటించనున్నట్లు వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి ఆదివారం తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



ధర్మపురి అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప పడిపూజ

ధర్మపురి: ధర్మపురిలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు పెండాల బాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో గురుస్వాములు కొజ్జుల రాజేశ్ మంత్రోచ్చారణలతో స్వామివార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి, పడిపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు భిక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు భీమనాథి మంగ అశోక్, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని బోడ కుల్‌దీప్ అనే అయ్యప్ప స్వామి ఆదివారం ఘనంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ పడిపూజలో టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు అయ్యప్ప స్వాములతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి రాజారెడ్డి, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి సన్మానం

రాయికల్: పట్టణానికి చెందిన మోర శైలేశ్ అయ్యప్పస్వామి దీక్షలో శబరిమలైకు పాదయాత్రగా వెళ్లి ఆదివారం రాయికల్‌కు రావడంతో పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అర్చకులు సాయి సుధీర్ శర్మ, గురుస్వాములు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు మల్లెగుట్ట మల్లికార్జున స్వామి ముస్తాబు

మల్యాల: మండల కేంద్రం లోని మల్లెగుట్టపై కొలువైన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం షష్ఠి ఉత్సవాలకు ఒగ్గుపూజారులు, ఆలయ కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మల్లెగుట్టపై మల్లికార్జునస్వామి సన్నిధిలో పట్నాలు వేసి, బోనంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటారు. దండి వారం మొదలుకుని ఏడు వారాలపాటు ఆలయ సన్నిధిలో నిత్యం ఢమరుకం చప్పుళ్లతో, శివసత్తుల పూనకాలు, భక్తుల నైవేద్యాల సమర్పణ సందడి నెలకొననుంది.

కాంగ్రెస్‌పై అభిమానం..



వరినాట్లతో కాంగ్రెస్, జీవన్‌రెడ్డి ఆకారంలో వేసిన రైతు

రాయికల్: కాంగ్రెస్ పార్టీతోపాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై అభిమానం ఉన్న రాయికల్ మండలం రాజ్‌నగర్ గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాస్ పటేల్ అనే రైతు తన వరిపొలంలో వరినాట్లతో కాంగ్రెస్, జీవన్‌రెడ్డి అనే ఆకారంలో వరినాట్లు నాటి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

క్లుప్తంగా

రన్నింగ్ పోటీలు ప్రారంభించిన డీఎస్పీ



పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

కోరుట్ల: పట్టణంలో అండర్ –16,18,20 ఏళ్ల బాల, బాలికల 2 కిలో మీటర్ల రన్నింగ్ పోటీలను మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. పోటీల అనంతరం ముగింపు కార్యక్రమంలో ఎస్సై కిరణ్ కుమార్ పాల్గొని విజేతలకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ ప్రతినిధులు ముత్యంరెడ్డి, అంజయ్య, కో–అధికారి కొమురయ్య, గంగాధర్, లక్ష్మీనారాయణ, ఆర్గనైజర్స్ కోట ప్రవీణ్, సూర్య,హైస్కూల్ కరస్పాడెంట్ బారీ, తదితరులు పాల్గొన్నారు.

వంటావార్పుతో ఆటో డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

రాయికల్: ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల ఆటో, జీపు, టాటా మేజిక్ ఓనర్లు, డ్రైవర్లు సంఘం ఆధ్వర్యంలో వంటావార్పుతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సామల్ల ప్రసాద్, నాగేశ్, రమేశ్, సుమన్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సమష్టిగా ఉండండి



లక్ష్మీనరసింహరావును సన్మానిస్తున్న నాయకులు

కథలాపూర్: గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమష్టిగా ఉండాలని వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు అన్నారు. ఆదివారం కథలాపూర్ మండలం సిరికొండలో బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం మండలంలోని పరిస్థితిని నాయకులను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, నాంపెల్లి లింబాద్రి, చుక్క దేవరాజం, గుండారపు గంగాధర్, అందె స్వాగత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



సిబ్బందిని అభినందిస్తున్న చైర్మన్ దేవరాజం

కథలాపూర్: మండలంలోని సిరికొండ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ఆదివారంతో ముగిసినట్లు చైర్మన్ చుక్క దేవరాజం తెలిపారు. సంఘం పరిధిలోని తక్కళ్లపెల్లి కొనుగోలు కేంద్రంలో 13,604 క్వింటాళ్లు, సిరికొండలో 15,230 క్వింటాళ్లు కొనుగోలు చేశామన్నారు. ఈ ధాన్యాన్ని 421 మంది రైతుల నుంచి సేకరించామన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సహకరించిన అధికారులు, సిబ్బందిని సన్మానించారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం

కథలాపూర్: వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ప్రభుత్వ విప్ పదవి వచ్చాక తొలిసారిగా వేములవాడకు రాగా, స్వాగతం పలికేందుకు ఆదివారం కథలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. విప్ ఆది శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, ఉపాధ్యక్షుడు కట్ట శంకర్, నాయకులు భైర దేవ్ యాదవ్, కల్లెడ గంగాధర్, భైర మల్లేశం, గోపిడీ ధనుంజయ్‌రెడ్డి, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మేడిపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ దొనకంటి ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ప్రధానంగా విద్యుత్ శాఖ తీరుపై చర్చించారు. భీమారం మండలంలోని మన్నెగూడెంలో విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాద స్థితిలో ఉన్నాయని, మన్నెగూడ ఎంపీటీసీ చెన్నమనేని రవీందర్ రావు సభ దృష్టికి తీసుకువచ్చారు. దేశాయిపేటలో గ్రామానికి వచ్చే కనెక్షన్ వేరుగా లేకపోవడంతో వ్యవసాయ పనుల నిమిత్తం ఎల్‌సి తీసుకుంటే గ్రామంలో కరెంటు పోతుందని, వేరే లైన్లు వేయాలని వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్ తెలిపారు. రాజ లింగంపేట సర్పంచ్ చారి విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదస్థాయిలో ఉన్నాయని తక్షణమే వాటిని సరిచేయలని కోరారు. సమస్య పరిష్కరిస్తామని ఏఈ హరిప్రసాద్ తెలిపారు. కొండాపూర్ సర్పంచ్ ధ్యావనపెల్లి అభిలాష్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని కోరారు. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యే గెలుపొంది మొదటిసారిగా నియోజకవర్గానికి రావడంతో కాంగ్రెస్ సర్పంచులు హాజరు కాలేదు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా నిలుస్తాం



మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

మల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి నాయకులు, కార్యకర్తలు కృంగి పోవద్దని.. కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పీసీసీ డెలిగేట్ సభ్యుడు, కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం మల్లాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌ను గెలుపించేందుకు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని, కాంగ్రెస్ పార్టీని గ్రామగ్రామాన బలోపేతం చేసి రాబోయే సర్పంచ్, పార్లమెంట్, ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని అన్నారు. నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీ పరిధిల్లో చైర్మన్ల స్థానాలను కైవసం చేసుకోవాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో పార్టీకి కోసం పనిచేసిన వారికే ప్రాధాన్యతనిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ క్యాతం మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకేటి నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొల్లపెల్లి రామాగౌడ్, మామిడి లక్ష్మారెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతు శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.10 వేలు వేతనం చెల్లించాలి

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు అన్నారు. పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో ఆదివారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలో ఇంతక ముందున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం దృష్టికి ఎన్నో సార్లు తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మునుగోరి హన్మంతు, మిడ్‌డే మిల్స్ వర్కర్స్ యూనియన్ నేతలు కొంక భాగ్య, సంగం పద్మ, సుక్క లక్ష్మీరాజం, అంకుస్, జగన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మ్యాథ్స్ ఒలంపియాడ్‌కు స్పందన

జగిత్యాలటౌన్: పట్టణంలోని జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో ఆదివారం నిర్వహించిన జ్యోతి మ్యాథమేటిక్ ఒలంపియాడ్ 2023కు అపూర్వ స్పందన లభించిందని పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు అన్నారు. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జయంతిని(గణిత దినోత్సవం) పురస్కరించుకుని నిర్వహించిన మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్‌లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకు చెందిన 1951 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. డిసెంబరు 22న ఫలితాలు విడుదల చేసి బహుమతులు అందిస్తామని హరిచరణ్‌రావు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థినులు

జగిత్యాలటౌన్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు నలంద డిగ్రీ కళాశాల విద్యార్థినులు వరికొప్పుల శరణ్య, చింతల అశ్విని ఎంపికయ్యారు. శాతవాహన యూనివర్సిటీ ఖోఖో జట్టుకు ఎంపికయిన విద్యార్థినులు ఈనెల 29వ తేదీన చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్ ఆదివారం తెలిపారు.

చక్కెర ఫ్యాక్టరీపై కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుంది

మెట్‌పల్లి: ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీపై కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఆదివారం అన్నారు. నడిచే ఫ్యాక్టరీని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూసివేసి ఈ ప్రాంత రైతులను మోసం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే ఫ్యాక్టరీని తెరుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీని అమలు చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనిపై తొందరలోనే కమిటీని ఏర్పాటు చేసి, ఆ తర్వాత పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రిటైల్ ఫ్రూట్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ ఇమ్రాన్

జగిత్యాలటౌన్: పట్టణ రిటైల్ ఫ్రూడ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా షేక్ ఇమ్రాన్ ఎన్నికయ్యారు. జగిత్యాల పట్టణ ఫ్రూట్ వెండర్స్ అసోసియేషన్ ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో 11 ఓట్ల మెజారిటీతో ఇమ్రాన్ గెలుపొందినట్లు ఎన్నికల అదికారి మహ్మద్ సలీం తెలిపారు.

ఎరుకల సంఘం అధ్యక్షుడిగా పోచయ్య

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం మోతె ఏకలవ్య ఎరుకల సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా దాసరి పోచయ్యను ఆదివారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎనుగు రాములు, ప్రచార కార్యదర్శిగా మొగలి గంగాధర్, సహాయ కార్యదర్శిగా దాసరి కిషన్, గౌరవ అధ్యక్షుడిగా శ్రీరామ్ భగవంతం, కోశాధికారిగా ఏడీ లక్ష్మీకాంతంను ఎన్నుకున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

సారంగాపూర్: మండలంలో కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుభరోసా (రైతుబంధు) కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల ఏఈవోలు అంజనేయులు, వెంకటేశ్ పేర్కొన్నారు.ఇటీవల భూములు కొన్న వారు, విరాసత్‌ల ద్వారా భూముల మార్పిడి జరిగినా, ఇతరత్రా మార్పిడి ద్వారా వ్యవసాయ భూములు తమ పేర్ల మీదికి భూములు పట్టాలు చేయించుకున్న వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లిరూరల్: చెర్ల కొండాపూర్ శివారులో ఉన్న గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆదివారం ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకున్నారు. మొరంను మెట్‌పల్లి పట్టణానికి తరలిస్తుండగా, మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

సారంగాపూర్: మండల పరిధిలోని సారంగాపూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని 18 గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన గొట్టిపదుత రాజు ఉపాధి కోసం సౌదీ దేశానికి వెళ్లి అక్కడ అనారోగ్యంతో బాధపడుతుండగా, రాజును స్వదేశం రప్పించేందుకు పలువురు దాతలు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త అందించిన రూ.5 వేల ఆర్థిక సాయంను గ్రామస్తులు ఆదివారం గల్ఫ్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ రిజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారులో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మోతె గంగాధర్(51) అనే వ్యక్తి ఈనెల 1న కోరుట్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. మండలంలోని సిరికొండ శివారులో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగాధర్ తీవ్రగాయాలపాలై కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. మృతుడి కుమారుడు నిఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నీలానాయక్ పేర్కొన్నారు.